సాక్షి
కుమురం భీం
బుధవారం । 22 । మార్చి । 2023



కాసులు కురిసేనా..!

ఉమ్మడి జిల్లాలోనే అతిపెద్ద వారసంతగా కౌటాల వార సంతకు పేరుంది. వార సంతకు అధికారులు ఈ నెల 23న వేలం నిర్వహించనున్నారు. 9లో▸



దెబ్బతిన్న పంటల పరిశీలన

పెంచికల్‌పేట్, దహెగాం మండలాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. నష్టం వివరాలు నమోదు చేసుకున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 /21.2

ఆకాశం కొంతమేర మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వర్షం కురిసే అవకాశం లేదు. మధ్యాహ్నం వేడిగా, ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'సమగ్ర శిక్ష' ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్: సమగ్ర శిక్ష స్కీంలో పని చేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీఈవో అశోక్‌కు వేర్వేరుగా వారి కార్యాలయాల్లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు పవన్ కుమార్ మాట్లాడుతూ విద్యా శాఖకు అనుబంధంగా ఉన్న సమగ్ర శిక్ష పథకంలో 15ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం అందించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీసీవో ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్, నాయకులు, ఉద్యోగులు మోహన్, రమణ, నలంద, గీత, భార్గవి, నగేష్, అనిత్ తదితరులు పాల్గొన్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలి



నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో నీరజ్‌కుమార్

రెబ్బెన(ఆసిఫాబాద్): హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటేందుకు వీలుగా నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలని డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ అన్నారు. రెబ్బెన మండల కేంద్రంలోని ఫారెస్ట్ నర్సరీని మంగళవారం తనిఖీ చేశారు. లక్ష్యానికి అనుగుణంగా మొ క్కలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌తోపాటు అటవీప్రాంతాల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి అడవులను పెంచాలన్నారు. ఫారెస్టు రేంజ్ అధికారి అప్పలకొండ, సెక్షన్ అధికారి కొమ్మలు, బీట్ అధికారులు దేవేందర్, మనోహర్ ఉన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని డీఐఈవో శ్రీధర్ సుమన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన పరీక్షకు మొత్తం 4,721 మంది విద్యార్థులకు 4,560 హాజరు కాగా, 161 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు కాపీయింగ్‌కు తావులేకుండా ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.

శంకర్‌లొద్దిలో ఉగాది

- ఫ్రేంసింగ్ మహరాజ్ తపస్సు చేసిన స్థలంలో నేడు వేడుకలు
- తరలిరానున్న భక్తులు
- అక్కడి నుంచి మహారాష్ట్రకు పాదయాత్ర

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలం శంకర్‌లొద్దిలో శంకరుడు కొలువైన చోట నేడు ఉగాది వేడుకలు అట్టహాసంగా నిర్వహించనున్నారు. శివుడి సన్నిధిలో నిర్వహించే వేడుకల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా నుంచి సేవాలాల్ భక్తులు, గిరిజనులు భారీగా తరలిరానున్నారు. ఈ పవిత్ర స్థలాన్ని ఆదివాసీలు సిద్ధికసగా కూడా పిలుస్తారు. ఈ స్థలానికి సమీపంలోనే ఆదివాసీల ఆరాధ్య దైవమైన జంగుబాయి అమ్మవారు కొలువై ఉన్నారు.

ఫ్రేంసింగ్ మహరాజ్ తపస్సు చేసిన స్థలం..

కరంజీగూడ పంచాయతీ పరిధిలోని శంకర్‌లొద్ది.. బంజారా గురు ఫ్రేంసింగ్ మహరాజ్ ఆరేళ్లు తప్పస్సు చేసిన పవిత్ర స్థలమని స్థానికులు చెబుతున్నారు. ఏటా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఇక్కడ జాతర నిర్వహిస్తారు. గుహలోని లింగాన్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. 41 రోజులపాటు సేవాలాల్ దీక్ష వేసుకునే భక్తులు ఇక్కడికి వచ్చి పూజలు చేస్తారు. దీక్ష గురు ఇచ్చిన ఆధ్యాత్మిక కేంద్రంగా శంకర్‌లొద్దిని వారు భావిస్తారు. పాదయాత్రగా ఇక్కడికి చేరుకునే భక్తులు శంకరుడితోపాటు దుర్గాదేవి, సేవాలాల్ మహారాజ్‌కు పూజలు నిర్వహిస్తారు. అనార్‌పల్లి మాజీ సర్పంచ్ రాథోడ్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో నేడు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు.

మహారాష్ట్రకు పాదయాత్ర

శంకర్‌లొద్దిలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బుధవారం మహారాష్ట్రలోని వాశీమ్ జిల్లాలో కొలువైన పోహరాదేవి ఆలయానికి ఆదిలాబాద్ మీదుగా సేవాలాల్ భక్తులు పాదయాత్రగా బయలుదేరనున్నారు. సుమారు పదివేల మంది భక్తులు 280 కిలోమీటర్ల దూరంలోని పోహరాదేవి ఆలయానికి శ్రీరామ నవమి నాటికి చేరుకోనున్నారు. ఈ సందర్భంగా అక్కడే మాల విరమణ చేస్తారు. దారిలో వీరికి మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడా కలుస్తారు. అయితే శంకర్‌లొద్దికి వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఏటా భక్తులు ఇబ్బంది పడుతున్నారు. రాళ్లు తేలిన రోడ్డుపై ప్రయాణం కష్టంగా ఉందని, ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



శంకర్‌లొద్దిలోని శంకరుడి గుహ

గుహలో లింగం

భక్తులు తరలిరావాలి



శంకర్‌లొద్దిలో ఉగాది సందర్భంగా నేడు మధ్యాహ్నం 12 గంటలకు బోగ్ భండార్ నిర్వహిస్తాం. భక్తులు భారీగా తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలి. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందవుతోంది. పోహరాదేవి ఆలయానికి వెళ్లే భక్తులు ఇక్కడి నుంచే పాదయాత్ర ప్రారంభిస్తారు.

– రాథోడ్ శంకర్‌నాయక్, సేవాలాల్ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు

'డబుల్' ఇళ్ల కేటాయింపుపై

విచారణ జరపాలి

- కలెక్టర్ ఆధ్వర్యంలో అర్హులకు ఇళ్లు పంపిణీ చేయాలి
- బీజేపీ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు



మాట్లాడుతున్న పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో అవకతవకలు, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని, కలెక్టర్ ఆధ్వర్యంలో ఇళ్లు లేని పేదలకు ఇళ్లు పంపిణీ చేయాలని బీజేపీ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమానికి సంఘీభావంగా వచ్చి గాయపడిన మహిళలను మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం సర్‌సిల్క్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన ధర్నాను అడ్డుకోవడానికి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు అన్నివిధాలా ప్రయత్నించారని ఆరోపించారు. 200 మంది పోలీసులు, ఆరుగురు ఎస్సైలు, ఇద్దరు సీఐలు, ఒక డీఎస్పీ స్థాయి అధికారితో పట్టణాన్ని దిగ్బంధం చేశారని అసహనం వ్యక్తం చేశారు. నిరుపేదలు ఇళ్ల కోసం ధర్నా చేస్తామంటే అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. లబ్ధిదారుల ఎంపిక కోసం రూ.రెండు లక్షల చొప్పున వసూలు చేశారని, ఆ డబ్బులను అధికార పార్టీ నాయకులు పంచుకున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, సిందం శ్రీనివాస్, వెంకటేశ్, ముత్తు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏలను నిర్వీర్యం చేస్తున్న బీఆర్‌ఎస్

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- జిల్లాలో రెండోరోజు కొనసాగిన పాదయాత్ర

ఆసిఫాబాద్/కెరమెరి: ధనిక రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఐటీడీఏలను నిర్వీర్యం చేస్తోందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర మంగళవారం జైనూర్ మండలంలోని రాసిమెట్ట, బూసిమెట్ట, బూసిమెట్ట క్యాంపు మీదుగా కెరమెరి మండలంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా కుమురం భీం పోరాటం చేసిన బూసిమెట్ట క్యాంపును సందర్శించారు. జిల్లాలో రెండో రోజు సుమారు 18 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగింది.

గోడు వెల్లబోసుకున్న గిరిజనులు

పాదయాత్రలో భాగంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు గిరిజనులు తమ గోడు వెల్లబోసుకున్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు రాలేదని, పింఛన్లు ఇవ్వడం లేదని, మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బూసిమెట్ట క్యాంపు వద్ద గిరిజనులు భట్టికి ఎదురొచ్చి గూడానికి తీసుకెళ్లారు. తెలంగాణ ప్రభుత్వం కొత్త పట్టా పాస్‌పుస్తకాలు ఇవ్వడం లేదని, ధరణిలో భూములు నమోదు చేయడం లేదని వివరించారు.



గిరిజనులతో కలిసి భోజనం చేస్తున్న భట్టి విక్రమార్క



గుస్సాడీ నృత్యం చేస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, పక్కన ఎమ్మెల్యే సీతక్క

బూసిమెట్ట క్యాంపులో ఆదివాసీ మహిళలు తయారు చేసిన వంటకాలతో భట్టి విక్రమార్క, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద రావు భోజనం చేశారు. జొన్న రొట్టెలు, తోటకూర, పెసరపప్పు, ఉల్లిపాయ కారంతో చేసిన వంటకాలను భట్టికి వడ్డించారు.

మధ్యాహ్నం తర్వాత కెరమెరికి..

మధ్యాహ్నం తర్వాత యాత్ర కెరమెరి ఘాట్‌కు చేరింది. అక్కడే టెంట్లు వేసుకుని భోజనం చేశారు. అక్కడి నుంచి ములుగు ఎమ్మెల్యే సీతక్క పాదయాత్రలో కలిసి నడిచారు. కెస్లాగూడ వద్ద గిరిజనులు వీరికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మన్ ప్రవీణ్ నాయక్ భట్టికి గుస్సాడీ టోపీ అందించారు. కెరమెరిలో రామారావు మహరాజ్‌కు నివాళులర్పించారు. రాత్రి ఝరిలోని మదర్సాలో బస చేశారు. బుధవారం ఆదివాసీలు నిర్వహించే ఉగాది వేడుకల్లో వీరు పాల్గొననున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, నాయకులు రాథోడ్ గణేశ్‌నాయక్, మర్సుకోల సరస్వతి, కుసుంబ్‌రావు, శేశారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆశ్రమ విద్యార్థి ప్రతిభ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థి అశోక్ రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు డీటీడీవో మణెమ్మ తెలిపారు. మంగళవారం విద్యార్థిని అభినందించారు. ఈ నెల 19న హైదరాబాద్‌లో స్ప్రిరిడ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా అండర్ 10 విభాగంలో నిర్వహించిన 80 మీటర్ రన్నింగ్‌లో అశోక్ బంగారు పతకంతోపాటు రూ.5వేల ప్రైజ్‌మనీ సాధించినట్లు తెలిపారు. ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, జిల్లా క్రీడాధికారి మధుసూదన్ పాల్గొన్నారు.

ఆల్ ఇండియా అథ్లెటిక్స్‌కు ఎంపిక

తిర్యాణి(ఆసిఫాబాద్): తిర్యాణి మండలం పంగిడిమాదర ఆశ్రమ పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్న గుండం లక్ష్మణ్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.గోపాల్ తెలిపారు. గతేడాది ఆగస్టులో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్‌లో జావెలిన్ త్రో విభాగంలో బంగారు పతకం సాధించి సత్తా చాటారు. దీంతో ఈ నెల 25 నుంచి 28 వరకు మహారాష్ట్రలోని పూణెలో నిర్వహించే జాతీయ స్థాయి ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాలలో లక్ష్మణ్‌ను డీటీడీవో మణెమ్మ, ఏటీడీవో క్షేత్రయ్య అభినందించారు.

గాలివాన బీభత్సం




కౌటాల(సిర్పూర్): కౌటాల మండలంలో మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. భాలేపల్లి సమీపంలో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. కౌటాల- తుమ్మిడిహెట్టి ప్రధాన రహదారిపై మొగడ్‌దగడ్ సమీపంలో రోడ్డుపై రెండు చెట్లు విరిగిపడ్డాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి

కాగజ్‌నగర్‌టౌన్: శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని కాగజ్‌నగర్ డీఎస్పీ ఎ.కరుణాకర్ అన్నారు. రంజాన్ మాసం త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో పట్టణ సీఐ బుద్దే స్వామి ఆధ్వర్యంలో ముస్లిం నాయకులు, మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పండుగలు జరిగేవిధంగా పోలీస్‌శాఖ అన్ని ప్రయత్నాలు చేస్తోందని, ప్రజలు సహకరించాలని కోరారు. సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్సై చంద్రశేఖర్, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు, ఎంఐఎం అధ్యక్షుడు అబ్దుల్ ముబీన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ కరుణాకర్

కార్మిక చట్టాలకు విలువ ఇవ్వని యాజమాన్యాలు

రెబ్బెన(ఆసిఫాబాద్): కార్మిక చట్టాలకు యాజమాన్యాలు విలువ లేకుండా చేస్తున్నాయని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా ఆరోపించారు. మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని సివిల్ డిపార్ట్‌మెంట్ కార్యాలయ ఆవరణలో ఐఎఫ్‌టీయూ తొమ్మిదో రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 25, 26, 27 తేదీల్లో మంచిర్యాలలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే ఐఎఫ్‌టీయూ తొమ్మిదో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు పోషం, శ్రీను, పోసుబాయి, కుమార్, బాపు, సంతు, సావిత్రి, శారద, తార, రాణి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

26న ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశం

ఆసిఫాబాద్అర్బన్: ఈనెల 26న మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో నిర్వహించనున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేని శంకర్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావ్ హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బోగె ఉపేందర్, ఆత్మకూరి చిరంజీవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలవేని శంకర్

పెళ్లికి నిరాకరించిందనే అంజలి హత్య

రామకృష్ణాపూర్: అంజలి హత్య కేసులో నిందితురాలు మహేశ్వరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 15న జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలు మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐ అశోక్‌తో కలిసి మంగళవారం విలేకరులకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల కాలేజీరోడ్‌లో నెన్నెల మండలం మన్నెగూడకు చెందిన పెరుగు మహేశ్వరి తన చెల్లెలు పరమేశ్వరి, మందమర్రి మండలం మామిడిగట్టుకు చెందిన అంజలి, మరో బంధువు కామెర విఘ్నేష్ ఒకే అద్దె ఇంట్లో ఉండేవారు. మహేశ్వరి పెట్రోల్‌బంక్‌లో, అంజలి కళ్లద్దాల షాప్‌లో పనిచేసేవారు. కాగా, అంజలి, మహేశ్వరికి సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఈక్రమంలో శ్రీనివాస్ అనే వ్యక్తి వీరింటికి తరచూ రాగా అంజలితో పరిచయం పెరిగింది. శ్రీనివాస్, అంజలి దగ్గరవుతున్నారని గ్రహించిన మహేశ్వరి తట్టుకోలేకపోయింది. పెళ్లి చేసుకుందామని అంజలితో మహేశ్వరిని కోరగా, ఇందుకు ఆమె నిరాకరించింది. ఇద్దరు మహిళలు వివాహం చేసుకోవడాన్ని సమాజం అంగీకరించదని చెప్పింది. దీంతో మహేశ్వరి అంజలి హత్యకు పక్కా ప్లాన్ వేసింది. అంజలి సొంతూరైన మామిడిగట్టుకు వెళ్దామని నమ్మించి ఈ నెల 15న బైక్‌పై తీసుకెళ్లింది. అటవీ ప్రాంతంలోకి వెళ్లాక అంజలిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు తానూ కత్తితో గాయపర్చుకుంది. అనంతరం మహేశ్వరి తన చెల్లెలు పరమేశ్వరి, శ్రీనివాస్‌కు ఫోన్ చేసింది. తాను అంజలి ఆత్మహత్య చేసుకోవాలని కత్తితో పొడుచుకున్నామని తెలిపింది. దీంతో శ్రీనివాస్ వెంటనే ఘటనా స్థలికి చేరుకుని ఇద్దరిని మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా అంజలి అప్పటికే మృతిచెందింది. కేసు నమోదు చేసి చికిత్స అనంతరం మహేశ్వరిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

కారు బోల్తా: ఇద్దరికి గాయాలు

బెజ్జూర్: మండలంలోని సలుగుపెల్లి గ్రామ సమీపంలోని పల్లె ప్రకృతివనం మూలమలుపు వద్ద కారు బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంథని పట్టణానికి చెందినవారు మంగళవారం కారులో మహారాష్ట్రకు వెళ్తున్నారు. ఈక్రమంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. క్షతగాత్రులను చికిత్స కోసం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, క్షతగాత్రుల వివరాలు తెలిపేందుకు నిరాకరించారు.

చాతి నొప్పితో విద్యార్థిని అవస్థలు

తిర్యాణి: తీవ్ర చాతి నొప్పితో బాధపడుతూ ఓ గిరిజన విద్యార్థిని నానా అవస్థలు ఎదుర్కొన్న సంఘటన మంగళవారం తిర్యాణి మండలంలో చోటు చేసుకుంది. విద్యార్థులు, గిన్నెధరి వైద్యురాలు ఆయేషా తెలిపిన వివరాల ప్రకారం.. గిన్నెధరి ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సుప్రియ అనే విద్యార్థిని మంగళవారం చాతి నొప్పితో విలవిలలాడింది. తోటి విద్యార్థినులు గమనించి సుప్రియను వెంటనే తిర్యాణి ఆసుపత్రికి తరలించారు. కాగా విద్యార్థిని నొప్పితో బాధపడుతున్నా ఉపాధ్యాయులు ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.



సుప్రియను అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న తోటి విద్యార్థిని

కోళ్ల వ్యాన్ బోల్తా

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని బురదగూడ శివారులోని వాగు వద్ద మంగళవారం అదుపుతప్పి కోళ్ల వ్యాన్ బోల్తా పడింది. కాగజ్‌నగర్ నుంచి కరీంనగర్‌కు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. డ్రైవర్ మహాత్మా ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సోనియా తెలిపారు.

సాయిష్మా మృతదేహంతో రాస్తారోకో

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లికి చెందిన ఎంబడి సాయిష్మా (22) ఆత్మహత్యకు కారకుడైన నిందితుడు నలిమెల వినయ్‌ను కఠినంగా శిక్షించాలని మృతురాలి కుటుంబీకులు, బంధువులు, స్థానికులు డిమాండ్ చేశారు. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన సాయిష్మా చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో సోమవారం మృతి చెందగా ఆమె మృతదేహానికి మంగళవారం లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అంబులెన్స్‌లో కొత్తమామిడిపల్లికి తీసుకువెళ్లే క్రమంలో మృతురాలి బంధువులు మేదరిపేట బస్టాండ్ వద్ద రహదారిపై గంటపాటు రాస్తారోకో చేశారు. తన కూతురు ఆత్మహత్యకు వినయ్‌తోపాటు మరికొందరు కారణమని అనుమానం వ్యక్తం చేశారు. మృతురాలి తల్లి రాజమణి దండేపల్లి ఎస్సై సాంబమూర్తి కాళ్లు పట్టుకుని వినయ్‌ను కఠినంగా శిక్షించాలని వేడుకుంది. లక్సెట్టిపేట సీఐ కృష్ణారెడ్డి, శ్రీరాంపూర్ మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు సాంబమూర్తి, లక్ష్మణ్ ఆందోళన వద్దకు చేరుకున్నారు. సాయిష్మా మృతిపై విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇవ్వగా ఆందోళన విరమించారు.